క్లుప్తంగా

జోరుగా ప్రధాన రహదారి నిర్మాణం



పూర్తవుతున్న ద్రాక్షారామ-రామచంద్రపురం ప్రధాన రహదారి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ–రామచంద్రపురం ప్రధాన రహదారి నిర్మాణం జోరుగా సాగుతోంది. రోడ్డు బాగా దెబ్బతినడంతో చాలా కాలంగా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఎట్టకేలకు ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి అవుతుండటంతో ద్రాక్షారామ, పరిసర గ్రామాల ప్రజలకు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాయవరం డీటీగా జానకి రామయ్య

రాయవరం: స్థానిక మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా కె.జానకిరామయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలో భాగంగా ఆలమూరు మండలం డీటీ జానకి రామయ్య ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన డీటీ విజయరేఖ ఆలమూరు మండలానికి వెళ్లారు.

టైలర్లను ఆదుకోవాలి

కపిలేశ్వరపురం (మండపేట): టైలర్లను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని మండపేట పట్టణ టైలర్స్ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. పట్టణంలో గురువారం నిర్వహించిన సంఘ సమావేశంలో నాయకులు పీఎస్ మూర్తి, రేకపల్లి శ్రీనివాస్, వింజరపు శ్రీనివాస్, శ్యామ్, బి.సాంబశివరావు, జె.సత్తిబాబు, ఎ.నారాయణరావు, కనకదుర్గ, సుబ్బలక్ష్మి మాట్లాడుతూ పలు సమస్యలను ప్రస్తావించారు. టైలర్లకు ఆరోగ్య కార్డులను మంజూరు చేయాలని, టైలర్ల సంఘాలను సహకార సంఘాలుగా గుర్తించాలని కోరారు.

డంపింగ్ యార్డు పరిశీలన



పట్టణంలోని డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం 24వ వార్డులోని డంపింగ్ యార్డును మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కమిషనర్ బి.రాము గురువారం పరిశీలించారు. డంపింగ్ యార్డు విస్తరణ కోసం 2.75 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు. సంబంధిత స్థలాన్ని పరిశీలించి, వినియోగానికి సంబంధించి పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, అడబాల వీరబాబు, డి.ఈ కె. శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, మేస్త్రి మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కపిలేశ్వరపురం: వార్షిక మరమ్మతు పనులు కారణంగా అంగర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఐదు గంటలు పాటు విద్యుత్‌ను సరఫరాను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారి విజయానంద్ గురువారం ప్రకటించారు. ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

పసలపూడి మెయిన్ ప్రాథమిక పాఠశాలకు అవార్డు



రోల్ మోడల్ స్కూల్ అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయుడు రాజు

రాయవరం: పసలపూడి ఆదర్శ మెయిన్ ప్రాథమిక పాఠశాల రోల్ మోడల్ స్కూల్ అవార్డును అందుకుంది. పలు పాఠశాలలను రోల్ మోడల్ స్కూల్‌గా అభివృద్ధి పర్చేందుకు అరబిందో సొసైటీ స్వచ్ఛంద సంస్థ పలు పాఠశాలలను ఎంపిక చేసింది. రాయవరం మండలం నుంచి పసలపూడి మెయిన్ ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేశారు. రోల్ మోడల్ స్కూల్‌గా ఎంపికైనందుకు గాను పాఠశాల హెచ్‌ఎంకు ఆహ్వానం అందింది. విజయవాడ సదరన్ గ్రాండ్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో గురువారం ఈ అవార్డును సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య, అరబిందో సొసైటీ స్టేట్ కోఆర్డినేటర్లు వెంకటచైతన్య, నటరాజ్‌ల చేతుల మీదుగా అందజేశారు. సర్టిఫికెట్, మెమెంటోను పాఠశాల హెచ్‌ఎం తరపున ఎం.రాజు అందుకున్నారు. ఆదర్శ మెయిన్ ప్రాథమిక పాఠశాల రోల్ మోడల్ స్కూల్‌గా ఎంపికవ్వడం సర్పంచ్ కడలి పద్మావతి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చింతా రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి తదితరులు హెచ్‌ఎం కోరుమిల్లి వెంకటరమణ, ఉపాధ్యాయులను అభినందించారు.

ఆక్రమణలను తొలగించండి

- శ్మశాన వాటికలను కాపాడండి
- కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల విన్నపం
- మొత్తం 34 అంశాలకు ఆమోదం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: పట్టణంలోని ప్రధాన రహదారిని ఆనుకుని లారీ యూనియన్ కార్యాలయం సమీపంలో ఇటీవల కొంతమంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు శ్మశానాల స్థలాలను ఆక్రమించి 60 అడుగుల రోడ్డును నిర్మించారని దీనిని వెంటనే ఆపాలని, పట్టణంలోని అన్ని కులాలకు చెందిన శ్మశాన వాటికల స్థలాల్ని కాపాడాలని పలువురు కౌన్సిలర్‌లు చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవికి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. తొలుత ఈ సమావేశంలో కౌన్సిల్ ఆమోదం కొరకు మొత్తం 34 అంశాలను సభలో చదివినిపించారు. పలు అభివృద్ధి పనుల టెండర్లకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కాగా రుడా నిధులు రూ.2 కోట్లతో చేపట్టే నాలుగు పార్కుల అభివృద్ధి 30 అంశంపై పలువురు సభ్యులు భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. గత కౌన్సిల్ సమావేశంలో రుడా నిధులతో పట్టణంలోని వై.జంక్షన్ సమీపాన ఉన్న లేవుట్‌లో రూ.కోటితో రెండు పార్కులను అభివృద్ధి చేసేందుకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మిగిలిన రూ.50 లక్షలతో హౌసింగ్ బోర్డు కాలనీలో పార్కు, రూ.50 లక్షలతో లలితానగర్ పార్కులను అభివృద్ధి చేసేందుకు గతంలో కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానించారు. అయితే ప్రస్తుతం జరిగిన కౌన్సిల్ సమావేశంలో హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న పార్కు స్థలం చిన్నది కావటం, వై జంక్షన్‌లో గల పార్కులు ఊరికి దూరంగా ఉండటం వలన ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదని పలువురు కౌన్సిలర్లు దరఖాస్తు చేశారని దీంతో మొత్తం రూ.2 కోట్లతో లలితానగర్‌లోని పార్కును అభివృద్ధి చేసేందుకు కౌన్సిల్ ఆమోదం కొరకు తీర్మానాన్ని తీసుకువచ్చినట్లు చైర్‌పర్సన్ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు కౌన్సిలర్ మేడిశెట్టి వెంకటలక్ష్మి, కొండేపూడి సూర్యకుమారిలో మొత్తం గతంలో మాదిరిగా నాలుగు పార్కులను అభివృద్ధి చేయాలని కోరారు. అయితే వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ తదితరులు ఊరికి దూరంగా ఉండటం మూలంగా వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్ వంటివి లలితానగర్ పార్కులో ఏర్పాటు చేయటం మూలంగా ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. దీంతో కౌన్సిల్ సభ్యులు 30వ అంశానికి ఆమోదం తెలిపారు. అనంతరం కౌన్సిలర్లు కట్టా శ్రీరాములు, బొక్కా సత్యనారాయణ, అంకం శ్రీను తదితరులు మాట్లాడుతూ ప్రధాన రహదారికి ఆనుకుని లారీ యూనియన్ కార్యాలయం వద్ద గల అన్ని కులాలకు చెందిన శ్మశానాన్ని, ఆక్రమించుకుని కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఆక్రమించుకుని రోడ్లు వేసి గోడలు నిర్మించారన్నారు. దీనిపై విజిలెన్స్ కమిటీ వేసి అక్రమణదారులపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ దీనిపై ఇప్పటికే అధికారులు వెళ్లి పరిశీలించటం జరిగిందని దీనిపై పోలీసులు నివేదిక అనంతరం మున్సిపాలిటీ ద్వారా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కమిషనర్ బి.శ్రీనివాసులు, డీఈ డి.దుర్గాప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్‌రాజు, ఇతర అధికారులు, కౌన్సిల్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్, కౌన్సిలర్లు పెంటపాటి దేవి, పోతంశెట్టి వెంకట శ్యామల, మేడిశెట్టి, కృష్ణవేణి, కేతా శ్రీను, కేతా సుజాత, కో ఆప్షన్‌సభ్యులు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణస్వీకారం



నూతన ట్రస్ట్ బోర్డు సభ్యులను సన్మానించిన గ్రామ పెద్దలు

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వరస్వామి ఆలయ నూతన ట్రస్ట్‌బోర్డు సభ్యులు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ చైర్మన్‌గా పిల్లి శ్రీనివాసరావు, సభ్యులుగా గొడవర్తి రామకృష్ణ, మోహమాటి శ్రీరాములు, పెమ్మాడి దుర్గా, అయినవిల్లి పద్మావతి, శీలం మాణిక్యం, తీపర్తి సత్యవేణి, జంధ్యాల శివ శంకరశర్మలను ఆలయ ఈఓ పద్మావతి ప్రమాణస్వీకారం చేయించారు. గ్రామ పెద్దలు నూతన ట్రస్ట్‌బోర్డు సభ్యులను పూలదండలు, శాలువాలతో సత్కరించారు. ఎంపీపీ పంపన నాగమణి, అయినవిల్లి అబ్బు, యువజన నాయకులు జుత్తక శ్యాం ప్రసాద్, నరాల ఏడుకొండలు, కట్టా సూర్యనారాయణ, పాలిక సుబ్రహ్మణ్యం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు



కాజులూరులోని పరీక్ష కేంద్రం

కాజులూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి జరుగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి ఒకటో తేదీ శుక్రవారం నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు ప్రారంభం కానుండగా, రెండో తేది శనివారం నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమై మార్చి 20 వరకూ జరుగుతాయన్నారు. ఈ ఏడాది తమ కళాశాల విద్యార్థులతో పాటు గొల్లపాలెం కాకతీయ కళాశాల, పీఎస్ఎన్ మూర్తి, కోంలక డీఆర్ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాయనున్నారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 269, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 290 మంది పరీక్షకు హాజరు కానున్నారన్నారు. ఇందులో మొదటి సంవత్సరం పరీక్షలకు కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 110 మంది విద్యార్థులు, ఇతర కళాశాలల నుంచి 159 విద్యార్థులు, ద్వితీయ సంవత్సరానికి కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 120 మంది, ఇతర కళాశాల నుంచి 170 మంది విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాయనున్నారన్నారు.

అరగంట ముందే పరీక్షకేంద్రంలో ఉండాలి

ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. పరీక్షలను మండల తహసీల్దారు, పోలీసులు అధికారులు పర్యవేక్షించనున్నారని పరీక్ష సమయానికి ఆలస్యంగా వచ్చిన వారిని లోనికి అనుమతించమన్నారు. సెల్‌ఫోన్‌లు, ఎటువంటి ఎలక్ట్రానిక్స్ పరికరాలు పరీక్ష కేంద్రాల వద్దకు తీసుకురాకూడదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షను అమలులో ఉంటుందని పరీక్ష రాసే సమయంలో విద్యార్థుల ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా కళాశాల పరిసరాల్లో ఉన్న స్థానికులు, ప్రజలు సహకరించాలన్నారు.

ప్రజల హృదయాల్లో వైఎస్సార్ సీపీ

- రెండోసారీ విజయం ఖాయం
- కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్



పట్టణంలోని అంకం వారి వీధిలో పర్యటిస్తున్న సూర్యప్రకాష్

రామచంద్రపురం: నవరత్న పథకాలతో ప్రజల హృదయాల్లో నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు తిరిగి ఆశీర్వదిస్తారని, రెండోసారి కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తీసుకువచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని 3వ వార్డు అంకం వారి వీధిలో గురువారం ఆయన ఇంటింటా పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా వారికి జరిగిన లబ్ధిని వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని వివరించారు. తిరిగి ఇదే లబ్ధి చేకూరాలంటే సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకోవాల్సిన ఆవశ్యకతలను ప్రజలకు వివరించారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రతి పక్షాలు అన్ని కలిసి ఎన్ని కుట్రలుల చేసిన ఎన్ని అబద్ధాలను ప్రచారం చేసినా తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల మతాలకు అతీతంగా వర్గాలకు పార్టీలకు అతీతంగా పథకాలు అందించిన వైనం సీఎం జగన్‌దన్నారు. ప్రతిపక్ష పార్టీలకు కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అందాయన్నారు. గడప గడపకు జరిగిన కార్యక్రమంలో ఇది స్పష్టంగా తెలుస్తుందన్నారు. మీకు లబ్ధి జరిగితేనే వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీగా కోరుతున్నారని, కానీ ప్రతిపక్షాలకు తాము ఇది చేశామని చెప్పుకునేందుకు ఒక్క పథకం కూడా లేదన్నారు. రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందని ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, స్థానిక నాయకులు కొప్పిశెట్టి శ్రీను, బండారు వెంకటరమణ, కొసనా ప్రసాద్, యనమదల సుబ్రహ్మణ్యం, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

9న దివ్యాంగుల మహా గర్జన

కపిలేశ్వరపురం (మండపేట): దివ్యాంగ హక్కులు సాధనే లక్ష్యంగా ఈనెల 9వ తేదీన విజయవాడలో 'హలో దివ్యాంగ .. చలో విజయవాడ' పేరుతో నిర్వహించనున్న మహా గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వికలాంగ హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జాతీయ కోర్ కమిటీ కో కన్వీనర్ అందె రాంబాబు కోరారు. మండపేటలో గురువారం సమితి ఆధ్వర్యంలో దివ్యాంగుల భవనంలో నిర్వహించిన జిల్లా స్థాయి సదస్సులో పలు సమస్యలపై చర్చించారు. మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ధూళి జయరాజు, అందె రాంబాబు మాట్లాడారు. అమరావతిలోని నాగార్జున యూనివర్సిటీ సమీపంలోని మైదానంలో నిర్వహించే మహాగర్జనలో దివ్యాంగుల సమస్యలపై చర్చించనున్నామన్నారు. సమావేశంలో సమితి నాయకులు మేడిద సత్యనారాయణ, శనగల భవాని, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు షేక్ నబి, కేశవ, అనుసూరి విజయ, ఆర్ రామకృష్ణ, టి.శ్రీను, సూరిబాబు, మేడపాడు పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



మండపేటలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ తోట, పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండల పరిధి తాపేశ్వరం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో అనసూరి లక్ష్మి, కోసెట్టి గంగాభవాని, సీబోలు సత్యవతి, ఘంటసాల వెంకట దుర్గా, ఎస్.దేవులమ్మ, బి సూర్యకుమారి, కోసెట్టి దుర్గా, గుడాల నాగరత్నం, బుర్రా మనోజ్, ఉప్పిడి దుర్గా, తోసపల్లి వెంకటలక్ష్మి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారంతా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గ్రామాలను అభివృద్ధి చేస్తున్న తీరుకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. వారంతా నాయకులు దాసరి లాజర్, బూరా చిన్న, ఎంపీటీసీ పంపన పద్మారావు, ఎంపీపీ వుండమట్ల వాసు ఆధ్వర్యంలో చేరారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పేదవాడికి సాయం చేసే అవకాశం వైఎస్సార్ సీపీలోనే ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట పృథ్వీరాజ్, నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు సన్నద్ధం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మండపేట పట్టణంలో విగ్రహాలు ఏర్పాటు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: మండపేట పట్టణంలో మరో ముగ్గురు మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఈ మేరకు గురువారం విగ్రహాల ఏర్పాటు కమిటీ నాయకులతో ప్రతిపాధిత స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ మండపేట పట్టణ ప్రధాన రహదారిపై ఇప్పటికే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరించామన్నారు. అదే ఒరవడిలో మరో మహనీయుడు జ్యోతీరావు పూలే, పేద ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన వంగవీటి మోహనరంగా, మండపేట కీర్తికి ప్రతీకగా నిలిచిన వీవీఎస్ఎస్ చౌదరి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూడు విగ్రహాల ఏర్పాటునకు మూడు కమిటీలను వేశామన్నారు. మహనీయుల విగ్రహాలు ఏర్పాటునకు సహకరిస్తున్న మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు విషయమై ఎమ్మెల్సీ తోట పట్టణంలోని బీసీ, ఓసీ సంఘాల నాయకులతోనూ, వంగవీటి రంగా, వీవీఎస్ఎస్ చౌదరిల అభిమానులతో కలిసి విగ్రహాలు ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించారు. వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డి రాధాకష్ణ, పిల్లి గణేశ్వరరావు, జిన్నూరి సత్య సాయి బాబా, పిల్లా వీరబాబు, పిల్లి శ్రీనివాస్, మందపల్లి రవికుమార్, మెండు బాపిరాజు, పేపర్తి సాంబు, పెంకే గంగాధర్, పంపన శ్రీనివాస్, ముమ్మిడివరపు బాపిరాజు, కోన సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్ఎంఎస్ అవార్డుకు 23 పాఠశాలల ఎంపిక

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను అన్ని అంశాల్లో అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా అరబిందో సొసైటీ స్వచ్ఛంద సంస్థ బాధ్యత తీసుకుంది. ఇందుకు గాను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 23 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసుకుంది. కె.గంగవరం మండలంలో 13, కపిలేశ్వరపురం మండలంలో ఆరు, రాజోలు, రావులపాలెం, ఉప్పలగుప్తం, రాయవరం మండలం నుంచి ఒక్కో పాఠశాలను ఎంపిక చేశారు. రోల్ మోడల్ స్కూల్స్‌గా అభివృద్ధి పర్చేందుకు ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎంలను గురువారం విజయవాడలోని సదరన్ గ్రాండ్ హోటల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆహ్వానించారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో సీమాట్ డైరెక్టరు మస్తానయ్య, అరబిందో సొసైటీ స్టేట్ కోఆర్డినేటర్లు వెంకటచైతన్య, నటరాజ్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేట్ పి.వెంకటవినోద్ చేతుల మీదుగా మెమెంటో, సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ కోఆర్డినేటర్ వెంకటచైతన్య మాట్లాడుతూ ఎంపికైన ప్రతి పాఠశాలలో అరబిందో సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇన్నోవేటివ్ ఆలోచనల ద్వారా బోధన చేపడతామన్నారు.

మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహించాలి



ఇన్విజిలేటర్లకు సూచనలిస్తున్న నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరెడ్డి

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ మెదటి, రెండో సంవత్సరం పరీక్షలను ఇన్విజిలేటర్లు సమర్థవంతంగా నిర్వహించాలని ప్రిన్సిపాల్ డీవీవీ నాగేశ్వరరెడ్డి సూచించారు. కళాశాలలో గురువారం ఇన్విజిలేటర్లతో పరీక్షల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చూడాలన్నారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా నిర్వహించాలన్నారు. కళాశాల విద్యార్థులతో పాటు, స్థానిక విజ్ఞాన్, రాయవరం ఉన్నత పాఠశాల హైస్కూల్ ప్లస్–2 విద్యార్థులు పరీక్షలకు 209 మందికి పైగా హాజరవుతున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరెడ్డి విలేకరులకు తెలిపారు. తొమ్మిది తరగతి గదులను విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధం చేశామని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, ఫర్నీచర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రానికి అనుమతించమన్నారు.

తాటాకిల్లు దగ్ధం


రూ.2లక్షల ఆస్తి నష్టం



ప్రమాదంలో కాలి బూడిదైన తాటాకిల్లు

రాయవరం: పెళ్లి ఊరేగింపు సందర్భంగా వేసిన తారాజువ్వ పడి తాటాకిల్లు దగ్ధమైన ఘటన సోమేశ్వరంలో గురువారం చోటు చేసుకుంది. స్థానిక సాయిబాబా ఆలయం సమీపంలో నివశిస్తున్న మట్టా ఏసురాజు తాపీ మేస్త్రిగా పనిచేసుకుంటున్నాడు. ఇంటికి తాళం వేసుకుని గ్రామంలో వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లాడు. ఆ సమయంలో పెళ్లి ఊరేగింపు నిర్వహిస్తుండగా బాణాసంచా కాల్చారు. కాలిన తారాజువ్వ ఇంటి మీద పడడంతో ఆ నిప్పురవ్వలకు తాటాకిల్లు అంటుకుని ఇల్లు పూర్తిగా కాలి బూడిదైంది. ఇంట్లో ఉన్న సామాన్లు కాలి బూడిదయ్యాయి. చీటీ పాడుకుని తెచ్చుకుని ఇంట్లో పెట్టుకున్న రూ.లక్ష నగదుతో పాటుగా, ఇంట్లో ఉన్న ఫ్రిజ్, చెక్క బీరువాలు, కుర్చీలు, టీవీ, అరకాసు బంగారం ఉంగరం, మోటార్ సైకిళ్లు కాలిపోయినట్లుగా బాధితులు పేర్కొన్నారు. వీటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని భావిస్తున్నారు. రామచంద్రపురం ఇన్‌ఛార్జి అగ్నిమాపక అధికారి ఐ.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపు చేశారు. మంటల ధాటికి పక్కింట్లో ఉన్న విలువైన సామగ్రి కూడా కాలిపోయినట్టు స్థానికులు తెలిపారు. ఆస్తినష్టం రూ.2లక్షలు వరకు ఉందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు అగ్నిమాపక అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు.

నేటి నుంచి మహిళా డెయిరీ సంఘ సభ్యులకు అవగాహన



ఎస్‌వీ రామచంద్రమూర్తి, ఎంపీడీఓ, రామచంద్రపురం

రామచంద్రపురం రూరల్: జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా రెండో దఫా మహిళా డెయిరీ సహకార సంఘం గ్రూపు సభ్యులకు నేటి నుంచి అవగాహనా సమావేశాలు నిర్వహించనున్నట్లు రామచంద్రపురం ఎంపీడీఓ ఎస్‌వీ రామచంద్రమూర్తి గురువారం విలేకరులకు తెలిపారు. నేటి ఉదయం 9.30 గంటలకు హసన్‌బాద, 10 గంటలకు తోటపేట, 11.30 గంటలకు కందులపాలెం, మధ్యాహ్నం 2 గంటలకు చోడవరం, వేగాయమ్మపేట, 2న ఉదయం 9.30 గంటలకు ఓదూరు, 10 గంటలకు వెల్ల, 11.30 గంటలకు నరసాపురపుపేట, 2 గంటలకు తాళ్లపాలెం, 4న ఉదయం 10 గంటలకు కాపవరం, వెంకటాయపాలెం, మధ్యాహ్నం 2 గంటలకు జగన్నాయకులపాలెం, యనమదల, 5న ఉదయం 10 గంటలకు ఏరుపల్లి, మధ్యాహ్నం 2 గంటలకు ఉండూరు, 6న ఉదయం 10 గంటలకు వెలంపాలెం, మధ్యాహ్నం 2 గంటలకు కొత్తూరు అర్బన్‌లకు సంబంధించిన సంఘం సభ్యులకు మెంటార్లుగా డాక్టర్ పి.రామచంద్రరావు, ఎంబీబీఎస్ఎస్ కృష్ణార్జున, రూట్ ఇంచార్జ్‌లుగా అప్పారావు, జవహర్‌లు వ్యవహరిస్తారని ఎంపీడీఓ తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాలకు మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సిందిగా కోరారు.